క్లుప్తంగా

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

బుచ్చిరెడ్డిపాళెం: జొన్నవాడలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజస్వామి బ్రహ్మోత్సవాలకు ఆదివారం అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా వరదరాజస్వామికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం పుట్టమట్టిలో నవధాన్యాలు చల్లి ఉత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. ఆలయ చైర్మన్ పీ ప్రేమ్‌సాగర్, ఈఓ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

పొదలకూరులో చిరుజల్లులు

పొదలకూరు : మండలంలో ఆదివారం చిరుజల్లులు పడ్డాయి. మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత, ఉక్కపోతతో ప్రజలు అల్లాడారు. సాయంత్రం వేళ ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు పడడంతో ప్రజలు సేదతీరారు. చిరుజల్లులతో వరి రైతులు ఆందోళనకు గురయ్యారు. మండలంలో ఇప్పటి వరకు వరికోతలు 60 శాతం మాత్రమే పూర్తయ్యాయి. మరో 40 శాతం పంట కోత పనుల్లో రైతులు ఉన్నారు. చాలా గ్రామాల్లో వారం రోజుల్లో నూర్పిళ్లు చేపట్టనున్నారు. వరికోత యంత్రాలు లభ్యం కాక కొందరు రైతులు సమయానికి కోతలు చేపట్టలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో వర్షం పడడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

వైభవంగా హనుమంతసేవ

బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక కోదండరాముడు ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం హనుమంతసేవను వైభవంగా నిర్వహించారు. ఉదయం విశేష పూజలు, తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. రాత్రి కోదండరాముడి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి హనుమంత వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ చైర్మన్ దొడ్ల మురళీకృష్ణారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వేడుకగా పారువేట ఉత్సవం

పొదలకూరు : శ్రీరామనవమి వేడుకల్లో అయ్యప్పనగర్‌లోని శ్రీదేవి,భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో పారువేట ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భజన గురువు గంగిరెడ్డి ఆధ్వర్యంలో కోలాటాన్ని ప్రదర్శించారు.

అక్రమంగా విద్యుత్ కంచెల ఏర్పాటుపై విచారణ

వెంకటాచలం : తిక్కవరప్పాడు-సర్వేపల్లి గ్రామాల మధ్యన అటవీ ప్రాంతంలో విద్యుత్ కంచెలతో జింకల వేటపై అధికారులు విచారణ జరుపుతున్నారు. శనివారం రాత్రి అటవీ ప్రాంతంలో విద్యుత్ కంచెలను ఏర్పాటు చేసి అక్రమంగా కనెక్షన్లు ఇస్తుండగా స్థానికులు గమనించడంతో మోటార్‌సైకిల్‌ను వదిలేసి ఆరుగురు వ్యక్తులు పరారైన విషయం తెలిసిందే. ఈ విషయం అటవీశాఖ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో ఆదివారం ఉదయం వెంకటాచలం, తిక్కవరప్పాడు, సర్వేపల్లి గ్రామాల పరిధిలోని అటవీప్రాంతంలో అటవీశాఖ సిబ్బంది పరిశీలించారు. అటవీప్రాంతంలో ప్రధాన విద్యుత్ లైన్లు ఎక్కడ ఉన్నాయో గుర్తించి, అక్కడ అక్రమంగా విద్యుత్ కనెక్షన్లు ఎలా ఇస్తున్నారో పరిశీలించారు. వెంకటాచలం పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని విద్యుత్ కంచెలు ఏర్పాటు చేస్తున్న వారిని గుర్తించి కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. మోటార్ బైక్ ఆధారంగా విద్యుత్ కంచెలు ఏర్పాటు చేస్తున్న వారిని రెండ్రోజుల్లో గుర్తిస్తామని పోలీసులు తెలిపారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



కొడవలూరు: కాణిపాకం వరసిద్ధి వినాయక మందిరంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు రూ.లక్ష విరాళం అందజేశారు. ఆదివారం ఆలయ నిర్వాహకులకు నగదు చెక్కు అందజేశారు. భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్విరామంగా కొనసాగాలనే ఆకాంక్షతో తన వంతుగా నగదు విరాళాన్ని అందజేసినట్లు ఆయన తెలిపారు.

కోడూరు బీచ్‌లో సందర్శకుల కోలాహలం



తోటపల్లిగూడూరు: మండలంలోని కోడూరు బీచ్ ఆదివారం సందర్శకులతో పోటెత్తింది. సాధారణంగా సెలవు, పండగ దినాల్లో సరదాగా గడిపేందుకు జిల్లా నలువైపుల నుంచి కోడూరు బీచ్‌కు సందర్శకులు తరలివస్తుంటారు. ప్రస్తుతం ఎండలు మండుతుండడంతో సేదతీరేందుకు జిల్లా నలువైపుల నుంచి కోడూరు బీచ్‌కు పర్యాటకులు ఆదివారం పోటెత్తారు.

క్రీడలతో ఉద్యోగులకు ఆటవిడుపు

- జేసీ కూర్మనాథ్
- ఉత్సాహంగా టీ - 20 క్రికెట్ మ్యాచ్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కూర్మనాథ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నిత్యం పని ఒత్తిడితో సతమతమయ్యే ఉద్యోగులకు క్రీడలతో ఆటవిడుపు లభిస్తుందని జేసీ కూర్మనాథ్ పేర్కొన్నారు. జిల్లా రెవెన్యూ శాఖ, జర్నలిస్ట్స్ జట్ల మధ్య ఫ్రెండ్లీ టీ - 20 క్రికెట్ మ్యాచ్‌ను ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆదివారం నిర్వహించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్న అనంతరం ఆయన మాట్లాడారు. కలెక్టర్ చక్రధర్ బాబు సూచనల మేరకు మ్యాచ్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. రెవెన్యూ జట్టులో జేసీ, ఆర్డీఓ మలోల, తదితర అధికారులు ఉత్సాహంగా ఆడారు. తొలుత బ్యాటింగ్ చేపట్టిన రెవెన్యూ జట్టు నాలుగు వికెట్ల నష్టానికి 124 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగి జర్నలిస్ట్స్ జట్టు ఏడు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.

వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: రూరల్ నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. జగనన్న నీవే మా భవిష్యత్తు కార్యక్రమంపై సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులతో నగరంలోని తన కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వలంటీర్లతో కలిసి గృహ సారథులు గృహాలను సందర్శించాలని కోరారు. సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి వారి అభిప్రాయాలను తెలుసుకోవాలని కోరారు. ఆయా ప్రాంతాల్లోని కార్పొరేటర్లు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లోనూ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. అనంతరం డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి మాట్లాడారు. రూరల్ నియోజకవర్గంలో ఆదాల ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. వందల కోట్లను అక్రమంగా సంపాదించిన కోటంరెడ్డి సోదరులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై నిందలు మోపడం సిగ్గుచేటని విమర్శించారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, పార్టీ మహిళా విభాగ జిల్లా అధ్యక్షురాలు గౌరి, కార్పొరేటర్లు నాగరాజు, రామ్మోహన్, విజయభాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, అవినాష్, శ్రీనివాస్‌యాదవ్, సత్తార్, నేతలు పరమేశ్వరరెడ్డి, సురేష్, రైల్వే బోర్డు సభ్యుడు వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

శంకరమఠంలో ఐదున చండీహోమం

నెల్లూరు(బృందావనం): చైత్ర పౌర్ణమిని పురస్కరించుకొని మూలాపేటలోని శంకరమఠంలో చండీహోమాన్ని ఈ నెల ఐదున నిర్వహించనున్నామని మఠం మేనేజర్ నందకిషోర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు విశేషంగా తరలిరావాలని కోరారు.

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని వినతి

నెల్లూరు (టౌన్): పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు శ్రీహర్ష ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. గతంలో చోటుచేసుకున్న పేపర్ లీకేజీలు పునరావృతం కాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులను కల్పించాలని పేర్కొన్నారు.

సంగీత, నృత్య పరీక్షలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(బృందావనం): ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలు, పాఠశాలల సర్టిఫికెట్, డిప్లొమా కోర్సుల వార్షిక పరీక్షలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఎస్వీబీ ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల ప్రిన్సిపల్ సాయిబాబా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల పదో తేదీ వరకు ఫీజును చెల్లించొచ్చని, అపరాధ రుసుముతో 24 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. వివరాలకు కార్యాలయం లేదా 94403 61606 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

డయల్ యువర్ కమిషనర్, స్పందన నేడు

నెల్లూరు(బారకాసు): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలను సోమవారం నిర్వహించనున్నామని కమిషనర్ హరిత ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డయల్ యువర్ కమిషనర్‌ను ఉదయం 9.30 నుంచి 10.30 వరకు నిర్వహించనున్నామని, 0861 – 2355678 నంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలను తెలియజేయాలని కోరారు. అనంతరం స్పందనను నిర్వహించనున్నామని తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



నెల్లూరు రూరల్: నగరంలోని 21వ డివిజన్లో గల మాగుంట లేఅవుట్లో రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపనను కార్పొరేటర్ మొయిళ్ల గౌరి ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. డివిజన్లో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి దాదాపు రూ.మూడు కోట్లను వెచ్చించనున్నామని పేర్కొన్నారు. ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సహకారంతో డివిజన్లోని సమస్యలను పరిష్కరించనున్నామని తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు సురేష్‌రెడ్డి, నేతలు విజయభాస్కర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, హేమంత్, రవి, శేఖర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్‌రెడ్డి, రమేష్, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'మహిషాసురుడు' ప్రీ రిలీజ్ ఈవెంట్



నటుడు రఘుబాబుకు సత్కారం

నెల్లూరు(బృందావనం): మహిషాసురుడు చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నగరంలోని పురమందిరంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సినీ నటుడు రఘుబాబు మాట్లాడారు. కార్డియాలజిస్ గురుప్రసాద్ నిర్మాతగా సందేశాత్మకంగా చిత్ర నిర్మాణాన్ని చేపట్టి.. స్థానిక నటీనటులతో పాటు పలువురికి అవకాశం కల్పించడం హర్షణీయమన్నారు. చిత్ర రంగంలో నెల్లూరుకు ఒక ప్రత్యేక స్థానం ఉందన్నారు. కార్యక్రమానికి తనను ఆహ్వానించడంపై ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం రఘుబాబును సింహపురి మూవీ అసోసియేషన్ అధ్వర్యంలో సత్కరించారు. 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి, దర్శకుడు రవికుమార్, క్రియేటివ్ డైరెక్టర్ రెమో, కళాసంఘాల కన్వీనర్లు హరిబాబు, అమీర్‌జాన్, హరనాథ్‌రెడ్డి, భాస్కర్, నటీనటులు స్వరూప, విజయహరిణి, లిఖిత, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

కలెక్షన్ ఏజెంట్ చేతివాటం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఓ ప్రైవేట్ ఏజెన్సీలో పని చేస్తున్న కలెక్షన్ ఏజెంట్ రూ.3.5 లక్షలను స్వాహా చేసిన ఘటన నగరంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. అరుణాచలం వీధికి చెందిన మారుతిప్రసాద్ అదే ప్రాంతంలో యాదగిరి లక్ష్మీనరసింహా పేరుతో ఏజెన్సీని నిర్వహిస్తున్నారు. నగరంలోని పలు దుకాణాలకు హార్లిక్స్, డెటాల్, తదితరాలను సరఫరా చేస్తున్నారు. ఈ క్రమంలో కలెక్షన్ ఏజెంట్‌గా కిరణ్‌కుమార్ 2019లో చేరారు. నగరంలోని దుకాణదారుల నుంచి ఆర్డర్లు తీసుకొని వస్తువులను ఏజెన్సీ ద్వారా సరఫరా చేసి.. దానికి సంబంధించిన నగదును జమచేసేవారు. గతేడాది డిసెంబర్‌లో ఏజెన్సీకి సంబంధించిన లావాదేవీలను మారుతిప్రసాద్ పరిశీలించగా, రూ.3.5 లక్షలు గోల్‌మాలైన విషయాన్ని గుర్తించారు. ఈ విషయమై కిరణ్‌కుమార్‌ను నిలదీయగా, సదరు మొత్తాన్ని తాను వినియోగించానని అంగీకరించారు. త్వరలో నగదును చెల్లిస్తానని చెప్పినా, నేటికీ ఇవ్వకపోవడంతో నవాబుపేట పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ చోరీ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): బైక్ చోరీకి గురైన ఘటనపై నవాబుపేట పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. వివరాలు.. నగరంలోని ప్రశాంతినగర్‌కు చెందిన అఫ్రోజ్‌బాషా నెల్లూరు సబ్‌ట్రెజరీ కార్యాలయంలో ఎస్టీఓగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో పప్పులవీధిలోని స్లిమ్‌లైఫ్ జిమ్ వద్ద తన హీరో గ్లామర్ బైక్‌ను గత నెల 31న నిలిపి లోపలికి వెళ్లారు. తిరిగొచ్చేసరికి బైక్ కనిపించకపోవడంతో చుట్టుపక్కల గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్పీని కలిసిన వింజమూరు ఎస్సై



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎస్పీ విజయారావును వింజమూరు ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన రంగనాథ్‌గౌడ్ మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. నెల్లూరు ట్రాఫిక్ విభాగంలో ఎస్సైగా పని చేస్తూ వింజమూరుకు బదిలీ అయిన విషయం విదితమే. ఈ క్రమంలో ఎస్పీని కలిశారు.

బ్యాక్‌లాగ్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు(వేదాయపాళెం): విభిన్న ప్రతిభావంతులకు సంబంధించిన బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఆ శాఖ ఏడీ నాగరాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. spsnellore. ap. gov. inను సంప్రదించాలని సూచించారు.

గిరిజనులపై వివక్ష తగదు

నెల్లూరు రూరల్: వావిలేటిపాడులో గిరిజనులపై కొందరు వివక్ష చూపడం తగదని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెంచలయ్య పేర్కొన్నారు. వావిలేటిపాడులోని గిరిజన కాలనీలో ఆదివారం ఆయన పర్యటించారు. నేతలు సతీష్‌చంద్ర, రమేష్, ఉషా, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా బ్రహ్మోత్సవాలు



వేణుగోపాలస్వామి ఆలయంలో..



త్యాగరాజ మందిరంలో..

నెల్లూరు(బృందావనం): నగరంలోని పలు ఆలయాల్లో బ్రహ్మోత్సవాలను వేడుకగా నిర్వహిస్తున్నారు. విశేషాలంకారాల్లో కొలువైన స్వామివార్లను భక్తులు ఆదివారం దర్శించుకున్నారు. సంతపేటలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో స్వామి వారు జింకవాహనంపై దర్శనమిచ్చారు.

- బాలాజీనగర్‌లోని సీతారామ స్వామి మందిరంలో సీతారామ, లక్ష్మణ, హనుమత్ సమేత అనంత కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను వేడుకగా నిర్వహిస్తున్నారు. హనుమంతసేవను కనులపండువగా జరిపారు. ఉభయకర్తలుగా సంజీవరావు, భాస్కర్, అమృతవల్లి దంపతులు వ్యవహరించారు.
- పప్పులవీధిలోని ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీరాముల వారి వార్షిక కొతాయి మహోత్సవాల్లో ఏకాంతసేవను నిర్వహించారు.
- మూలాపేటలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో స్వామివారు సూర్యప్రభ, హంసవాహనంపై సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా బాలాజీ, రవీంద్రనాథ్‌సింగ్, సత్యవతిబాయి దంపతులు, నిరంజన్‌రెడ్డి వ్యవహరించారు.
- వేదాయపాళెంలోని త్యాగరాజ స్వామి మందిరంలో తిరుమంజనం, విష్ణుసహస్రనామార్చన సామూహిక పారాయణం, గరుడవాహనసేవను నిర్వహించారు.
- నగరంలోని తల్పగిరి రంగనాథ స్వామి దేవస్థానంలో రంగనాయకి తాయార్లకు తిరుమంజనం, స్థల పురాణ పఠనం, ప్రాకారోత్సవం, ఊంజల్‌సేవను నిర్వహించారు.
- ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని కోదండ రామస్వామి దేవస్థానంలో ధ్వజారోహణం, శేషవాహనసేవను నిర్వహించారు. ఉభయకర్తలుగా విజయసారథి, రవీంద్రకుమార్, జయమ్మ వ్యవహరించారు.
- శబరి శ్రీరామక్షేత్రంలో కోదండ రామస్వామి, ప్రసన్నాంజనేయస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. విదుమౌళి శిష్యబృందం, రాజరాజేశ్వరి నృత్యనికేతన్ విద్యార్థులతో శాస్త్రీయ నృత్య ప్రదర్శన అలరించింది.

టీడీపీ సమన్వయ కమిటీ సమావేశం

నెల్లూరు (టౌన్): టీడీపీ అధినేత చంద్రబాబు నెల్లూరుకు ఈ నెల ఏడున రానున్న నేపథ్యంలో పార్టీ జిల్లా కార్యాలయంలో సమన్వయ కమిటీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. అనంతరం ఎన్టీఆర్‌నగర్‌లోని వేణుగోపాలస్వామి కళాశాల మైదానాన్ని పరిశీలించారు. నెల్లూరు పార్లమెంట్ ఇన్‌చార్జి జనార్దన్‌రెడ్డి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి రవిచంద్ర, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మందుల అందజేత



నెల్లూరు(బృందావనం): వికాస్ ఆరోగ్య దీపిక 15వ విడత మందుల పంపిణీ కార్యక్రమాన్ని బాలాజీనగర్‌లోని వికాస్ ప్రజాహిత సేవా సమితి కార్యాలయ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరాన్ని డాక్టర్ సహజారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు, 14వ డివిజన్ కార్పొరేటర్ ప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. డివిజన్లోని రోగులకు అండగా నిలవాలనే సంకల్పంతో రూ.50 వేల విలువైన మందులను 15 నెలలుగా అందజేస్తున్నానని తెలిపారు. అనంతరం సహజారెడ్డిని సత్కరించారు. దాతలు నాగేంద్ర, ప్రసన్నకుమార్‌రెడ్డి, హరిరాజా, లక్ష్మీపతిరాజు, వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను వివరించండి



మాట్లాడుతున్న మదన్‌మోహన్‌రెడ్డి

నెల్లూరు(సెంట్రల్): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై రూరల్ పరిధిలోని 28వ డివిజన్లో ఇంటింటికీ వెళ్లి వివరించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత, మాజీ కార్పొరేటర్ మదన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మూడు సచివాలయాల గృహ సారథులు, వలంటీర్లు, బూత్ కమిటీ కన్వీనర్లతో సమావేశాన్ని నగరంలోని రాజరాజేశ్వరి కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. మోహన్‌రెడ్డి, దొరబాబు, సౌజన్యరెడ్డి, కృష్ణప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మట్టల ఆదివారం



నెల్లూరు(బృందావనం): మట్టల ఆదివారాన్ని నగరంలో వేడుకగా నిర్వహించారు. వీఆర్సీ సెంటర్ నుంచి గాంధీబొమ్మ వరకు ర్యాలీని బాప్టిస్ట్ చర్చి డొనీహాల్ కార్యదర్శి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిపారు. మట్టల ఆదివార నేపథ్యాన్ని చిన్నారులకు వివరించారు. పాస్టర్ అనిల్‌కుమార్, సండే స్కూల్ సూపరింటెండెంట్ నివేదిత, బ్రదర్ జానీజో, సంజయ్, దినేష్, మహేష్, అనిల్ గౌరవ్, తదితరులు పాల్గొన్నారు.

కోర్టు తీర్పు చరిత్రాత్మకం



మాట్లాడుతున్న గోపాల్‌రెడ్డి

నెల్లూరు(అర్బన్): దివంగత డాక్టర్ విజయకుమార్ హత్య కేసులో కోర్టు తీర్పు చరిత్రాత్మకమని విజయకుమార్ మెమోరియల్ నెల్లూరు ఆస్పత్రి ట్రస్ట్ చైర్మన్ గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మద్రాస్ బస్టాండ్ సమీపంలోని నెల్లూరు ఆస్పత్రి సమావేశ మందిరంలో విజయకుమార్ మిత్రులు, ప్రజాసంఘాల కార్యకర్తలతో సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏడున్నరేళ్ల క్రితం విజయకుమార్‌ను ఆయన భార్య, కుమారుడు కిరాయి హంతకులతో కలిసి హత్య చేయడం దుర్మార్గమని చెప్పారు. సమాజంలో విలువలు నశించిపోవడం బాధాకరమన్నారు. కోర్టుకు అన్ని ఆధారాలను సమర్పించడంలో మిత్రులతో పాటు ప్రజాసంఘాలు విశేష కృషి చేశారని, దీంతో హంతకులకు యావజ్జీవ శిక్ష పడిందని చెప్పారు. విజయకుమార్ తల్లి జయలక్ష్మి, డాక్టర్ సుధాకర్‌రెడ్డి, లాయర్ అబ్బాయ్‌రెడ్డి, శ్రీనివాసులు, నారాయణ, మాల్యాద్రి, చక్రపాణి, తదితరులు పాల్గొన్నారు.

పొలాల వద్ద కరకట్టల దహనం



నెల్లూరు రూరల్: అక్కచెరువుపాడులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత విజయరామిరెడ్డికి చెందిన పొలాల వద్ద గల కరకట్టలను కొందరు శనివారం రాత్రి దహనం చేశారు. ఘటనపై వేదాయపాళెం పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. పొలాల్లో కొందరు వ్యక్తులు గుడిసెలను ఇటీవల వేసి ఆక్రమణలకు పాల్పడ్డారని.. రికార్డులను పరిశీలించిన అనంతరం ఆక్రమణలను రెవెన్యూ, పోలీస్ అధికారులు తొలగించారని ఆయన చెప్పారు. ఆక్రమణలకు పాల్పడిన వారే ఈ ఘాతుకానికి ఒడిగట్టి ఉండొచ్చని పేర్కొన్నారు.